క్లుప్తంగా

ఆలయాల్లో హుండీల ఆదాయం లెక్కింపు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని గొల్లవానితిప్ప రోడ్డులో ఉన్న శ్రీదుర్గా లక్ష్మీ అమ్మవారి దేవస్థానంలో 4 నెలల 10 రోజులకుగాను హుండీలను తెరిచి లెక్కించగా రూ.1,22,611 నగదు వచ్చిందని ఆలయ ఈఓ గొట్టుముక్కల నాగ సీతారామరాజు తెలిపారు. అలాగే మారుతీ టాకీస్ సెంటర్‌లోని శ్రీదాసాంజనేయస్వామి వారి దేవస్థానంలో 2 నెలల 20 రోజులకుగాను హుండీలను తెరిచి లెక్కించగా రూ.1,24,651 నగదు వచ్చిందని పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, పోలేరమ్మ అమ్మవారి దేవస్థానంలో 7 నెలల 20 రోజులకుగాను హుండీలను తెరిచి ఆదాయాన్ని లెక్కించగా రూ.1,00,018 వచ్చిందని వివరించారు. ఆయా హుండీల లెక్కింపులో ధర్మకర్తలు, డి.వి. కృష్ణంరాజు పాల్గొన్నారు.

క్షీరారామలింగేశ్వరుని హుండీ ఆదాయం లెక్కింపు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం హుండీ ఆదాయం రూ. 13,37,985లు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి యాళ్ల సూర్యనారాయణ తెలిపారు. మంగళవారం దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారి వర్ధినీడి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో హుండీలను తెరిచారు. అనంతరం లెక్కించగా నగదుతో పాటు 23.350 గ్రాముల బంగారం, 2.80 కేజీల వెండి వచ్చిందన్నారు.

నేడు సుబ్రహ్మణ్యేశ్వరుడి విగ్రహ ప్రతిష్ఠ

ఆకివీడు: స్థానిక ఆనాల చెరువు గట్టుపై వల్లీ దేవ సేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడి నూతన ఆలయంలో విగ్రహాల పునఃప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం వైభవోపేతంగా జరుగనుంది. ఈ సందర్భంగా మంగళవారం నూతన విగ్రహాలకు ధాన్యాదివాస కార్యక్రమం నిర్వహించారు. నూతన ఆలయ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ నేరెళ్ల రామకృష్ణ దంపతులు నిర్వహించనున్నారు. అనంతరం శాంతి కల్యాణం, అఖండ అన్నసమారాధన జరుగుతుందని అభివృద్ధి కమిటీ ప్రతినిధులు తెలిపారు.

వాహనాల తనిఖీ


ఉండిలో వాహనాలను తనిఖీ చేస్తున్న అధికారులు

ఉండి: మండలంలో ఎన్నికల నియమావళిని అధికారులు కఠినంగా అమలు చేస్తున్నారు.దీనిలో భాగంగా మండలంలోని ప్రతీ గ్రామంలోను అన్ని పార్టీలకు సంబంధించి బ్యానర్‌లను, వాల్ పోస్టర్‌లను ఇప్పటికే తొలగించారు. అంతే కాకుండా ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేస్తూ నిఘా ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా మంగళవారం ఉండి ఆకివీడు జాతీయ రహదారిపై పోలీసులు, అధికారులు ఉమ్మడిగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎవరైనా అధిక మొత్తంలో నగదు కలిగి ఉండే దానిని సీజ్ చేస్తామని సరైన ఆధారాలు కలిగి ఉండే దానిని వారికి అప్పగించేస్తామని అధికారులు తెలిపారు. ప్రతి తనిఖీని ఎప్పటికప్పుడు వీడియో షూటింగ్ ద్వారా రికార్డు చేస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.వీంద్ర, ఈఓపీఆర్డీ ఎం.రామకృష్ణారెడ్డి, ఏఎస్సై ఆకురాతి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గా మల్లేశ్వరస్వామి కల్యాణోత్సవాల ప్రారంభం

పాలకొల్లు అర్బన్: ఆధ్యాత్మిక ఉత్సవా లు ప్రజల మధ్య ఐక్యతకు చిహ్నాలుగా నిలుస్తాయని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. పాలకొల్లు పట్టణంలోని యడ్లబజారులోని శ్రీకనకదుర్గా మల్లేశ్వరస్వామి కల్యాణోత్సవాలు మంగళవారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గుడాల గోపి-మంగతాయారు దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలుచేశారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవాలకు అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన గుడాల గోపి దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కావలి శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ కావలి చంద్రావతి, ఈవో ఎన్ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

సిద్ధాంతంలో..

పెనుగొండ: సిద్ధాంతంలో విజయగోపాలస్వామి జగన్మాతలు రుక్మిణి,సత్యభామలు, మాధవ స్వామి జగన్మాతలు శ్రీదేవిభూదేవి వార్ల కల్యాణం కనుల పండుగగా నిర్వహించారు. మంగళవారం రాత్రి ఆలయ అర్చకులు ఖండవల్లి సీతారామాచార్యులు(రాంబాబు), ఖండవల్లి శోభనాద్రాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణాన్ని నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవార్లకు కుంకుమార్చనలు, అభిషేకంలు , ధ్వజారోహణ, అంకురార్పణ, బలిహరణలు నిర్వహించారు.

ఎన్నికల నిబంధనలపై అవగాహన

పాలకొల్లు అర్బన్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు ప్రలోభాలకు గురికావద్దని పాలకొల్లు సీఐ కుడుపూడి సతీష్ చెప్పారు. మండలంలోని పెదమామిడిపల్లి, వరిధనం గ్రామ సచివాలయాల వద్ద మంగళవారం రాత్రి ఓటర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు.ఎవరైనా ఎన్నికల నిబంధనలకు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటారన్నారు.

జగన్‌ను మళ్లీ సీఎం చేయడమే లక్ష్యం


పెదఅమిరం పార్టీ నాయకులతో ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు


వేంపాడులో పార్టీ నాయకులు, కార్యకర్తలతో పీవీఎల్ నర్సింహరాజు

డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

కాళ్ల: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీను గెలిపించడం ద్వారా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకునేందుకు శ్రేణులు సైనికుల్లా పని చేయాలని ఉండి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు పిలుపునిచ్చారు. మండలంలో పెదఅమిరం, వేంపాడు, గ్రామాలలో మంగళవారం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులనుద్దేశించి మాట్లాడుతూ పేద ప్రజల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటును అందిస్తున్న జగన్ మోహన్ రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందాన్నారు. నాయకులు ఎవరికి వారే బాధ్యతగా తీసుకుని పార్టీని గెలిపించుకునేందుకు కృషి చేయాలని కోరారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు మేలు చేశారు కాబట్టే ధైర్యం ప్రజల్లో వెళ్లగలుగుతున్నామని అన్నారు. ఉండి నియోజకవర్గంలో తనను ఎమ్మెల్యేగా గెలిపించడానికి ప్రతి ఒక్కరు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు ఏ సంక్షేమ పథకం పొందాలన్నా మధ్యవర్తిత్వం లేకుండా, అవినీతికి తావు లేకుండా ప్రజల చెంతకే సంక్షేమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారన్నారు. వలంటీర్ వ్యవస్థతో సంక్షేమ పథకాలను నేరుగా ఇంటి వద్దకే తీసుకువచ్చేలా గొప్ప ప్రణాళిక తీసుకొచ్చారని జగన్ మోహన్ రెడ్డిని కొనియాడారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ ఆయన ఆశలకు అనుగుణంగా ప్రతి కార్యకర్త నాయకులు ప్రజాప్రతినిధులు ముందుకు సాగాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ పెనుమత్స విశ్వనాథరాజు, జెడ్పీటీసీ సభ్యుడు పళ్ళిగోళ్ల సోమేశ్వరరావు, మండల కన్వీనర్ గణేశ్న రాంబాబు, కోపల్లె సొసైటీ అధ్యక్షుడు వేగేశ్న జయ రామ కృష్ణంరాజు, డొక్కు సోమేశ్వరరావు ,జవ్వాది సత్యనారాయణ, వీరమల్లు బోసు, ఇర్రింకి శ్రీనివాస్, బిరుదు గద్ద గంగాధర్, జావ్వాది కిషోర్, వీరమల్లు గంగయ్య, ఇళ్ల హరికృష్ణ, మట్టా పండు, దాసరి సత్యనారాయణ,వేగేశ్న సూరిబాబు పాల్గొన్నారు.

కూటమిని చిత్తుచిత్తుగా ఓడించాలి


పీవీఎల్ నర్సింహరాజును సన్మానిస్తున్న నాయకులు

పాలకోడేరు : వైఎస్ జగన్ చేసిన అభివృద్ధి, సంక్షేమం వివరించి ఉండి నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజును అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి పొన్న మండ బాలకృష్ణ అన్నారు. మంగళవారం ఆయన పీవీఎల్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి తనకు పదవి ఇచ్చి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బాలకృష్ణ మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వం లో రాష్ట్రంలో 175 కి 175 నియోజకవర్గాల్లో అభ్యర్థులను అత్యధిక మెజార్టీ తో గెలిపిస్తామని, అపవిత్ర పొత్తులతో ముందుకు వస్తున్న కూటమిని చిత్తు చిత్తుగా ఓడించి, చంద్రబాబుకు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ఈయన వెంట నాయకులు చీకటమిల్లి మంగరాజు, మాజీ సర్పంచులు చల్ల బోయిన పాపారావు, మంతెన సుబ్రహ్మణ్యం రాజు, విస్సాకోడేరు సర్పంచ్ బొల్లా శ్రీనివాస్ ఎంపీటీసీ సభ్యుడు బొల్లం గాంధీ, రమేష్ చంద్ర మోహన్, పంపన రామకృష్ణ, దిడ్ల రవి తదితరులు ఉన్నారు.

విదేశీ మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

భీమవరం అర్బన్: మండలంలోని లోసరి జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద మంగళవారం విదేశీ మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని రూరల్ ఎస్సై జి రాజు తన సిబ్బందితో తనిఖీలు చేసి అదుపులోకి తీసుకున్నారు. ఇబ్రాయేలు నుంచి కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల మీదుగా అంబేద్కర్ కోనసీమ జిల్లాకు సదరు వ్యక్తి వెళ్లాల్సి ఉండగా లోసరి చెక్‌పోస్టు వద్ద అదుపులోకి తీసుకుని 7 విదేశీ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని ఆయనపై రూరల్ సీఐ సత్య కిషోర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా భీమేశ్వరుడి కల్యాణం


భీమేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: స్థానిక మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. కల్యాణం సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతిరెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు నూతన వస్త్రాలు స్వామి వారికి అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఎస్కే.రసూల్‌బీబీ, నగర పంచాయతీ వైస్‌చైర్మన్ పుప్పాల పండు, ఆలయ మేనేజర్ రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహానికి ముసుగు


భీమవరంలో సినీనటుడు కృష్ణ విగ్రహానికి ముసుగు వేసిన దృశ్యం

భీమవరం: పట్టణంలోని సూపర్‌స్టార్ కృష్ణ అభిమానం సంఘం ఏర్పాటు చేసిన సినీనటుడు ఘట్టమనేని కృష్ణ కాంస్య విగ్రహం ఆవిష్కరించి కేవలం 10 రోజులు గడవకముందే విగ్రహానికి ముసుగుపడింది. ఈ నెల 17న ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో సినీనటుడు, మాజీ ఎంపీ కృష్ణ విగ్రహానికి కూడా ముసుగు వేశారు. పట్టణంలోని కృష్ణ అభిమాన సంఘం నాయకులు ఎంతో కాలంగా కృష్ణపై అభిమానంతో కాంస్య విగ్రహంఏర్పాటుచేయాలని భావించారు. అయితే విగ్రహం ఏర్పాటుకు అనువైన స్థలం లభించకపోవడంతో జాప్యం జరిగింది. ఎట్టకేలకు మునిసిపాల్టీ ఎడ్వర్డ్ ట్యాంక్ చెరువు గట్టున వార్డు సచివాలయం భవనం పక్కన స్థలం కేటాయించడంతో విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఈనెల 12న సినీ నిర్మాత, కృష్ణ సోదరుడు ఘట్టమనేని ఆదిశేషగిరిరావు, మరొక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ్ చేతుల మీదగా ఎంతో అట్టహాసంగా ఆవిష్కరించారు. అయితే ఎన్నికల కోడ్ అమలులోనికి రావడంతో కృష్ణ నిలువెత్తు విగ్రహానికి పూర్తిగా ముసుగువేశారు. దీనితో కృష్ణ అభిమానులు విగ్రహం పెట్టిన సంతోషం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రశాంత ఎన్నికలే వైఎస్సార్ సీపీ లక్ష్యం


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు అంబటి రమేష్

ఆకివీడు: ఎన్నికలు ప్రశాంతంగా, సామరస్యపూర్వకంగా, నిబద్ధతతో జరగాలని వైఎస్సార్ సీపీ కోరుకుంటుందని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు అంబటి రమేష్ చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వివిధ రాజకీయ పార్టీలతో ఎన్నికలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీల మధ్య కవ్వింపు చర్యలు తగదన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగేందుకు అధికారులు కృషి చేయాలని నాయకులు సహకరించాలని కోరారు. వలంటీర్లను ఎన్నికల విధులకు వినియోగించుకోవద్దని ఎన్నికల సంఘం సూచించిందన్నారు. ఎన్నికల ప్రచారంలో వలంటీర్లను వినియోగిస్తున్నారని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా బ్యానర్లు, పోస్టర్లు అతికిస్తున్న వాటిపై చర్యలు తీసుకోవాలని రమేష్ సూచించారు. పలు పార్టీల నాయకులు మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు అమలు జరిగే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగే సమాచారాన్ని ప్రజలు తెలియజేసేందుకు పట్టణ, మండల కేంద్రాలో టోల్‌ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని సూచించారు. వలంటీర్లను ఎన్నికల ప్రచారానికి వినియోగించ వద్దని ఉత్తర్వులు ఉన్నాయా? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని అతిక్రమించవద్దని విజ్ఞప్తి చేశారు. రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. వలంటీర్లను ఎన్నికల ప్రచారంలో వినియోగించుకోకూడదనే విషయాన్ని రిటర్నింగ్ అధికారిని అడిగి తెలుసుకుని, సమాచారం తెలియజేస్తామన్నారు. డీటీ ఫరూక్, మండల పరిషత్ ఏఓ శ్రీకర్, ఈఓపీఆర్డీ సుబ్బారావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు అన్యెం కృష్ణ, యూత్ అధ్యక్షుడు చిక్కాల చిన్నా, జేసీఎస్ మండల కన్వీనర్ పుప్పాల పండు, టీడీపీ, జనసేన, సీపీఎం, దాని అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలగా వీఈసీ కళాశాల


సమావేశంలో మాట్లాడుతున్న బాబ్జి

వీరవాసరం: స్థానిక వీఈసీ జూనియర్ కళాశాల ప్రభుత్వ జూనియర్ కళాశాలగా రూపాంతరం చెందిందని సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సత్యనారాయణ మూర్తి (బాబ్జి) తెలిపారు. కళాశాలలో మంగళవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. గత 40 సంవత్సరాల క్రితం వీరవాసరం ఎడ్యుకేషనల్ కమిటీగా ఏర్పడి జూనియర్ కళాశాలగా రన్ చేస్తున్న సమయంలో కళాశాలకు ఏర్పడిన ఇబ్బందుల దృష్టిలో ఉంచుకొని అప్పటి పాలకొల్లు ఎమ్మెల్యే వర్ధినీడి సత్యనారాయణమూర్తి (సత్యం) వీరవాసరం ఎడ్యుకేషనల్ కమిటీ మొత్తం రాజీనామాలు చేసి కళాశాల పునర్నిర్మాణం నిమిత్తం వర్ధినిడి సత్యనారాయణ మూర్తికి అప్పజెప్పారన్నారు .అప్పటినుంచి ఇప్పటివరకు వీఈసీ జూనియర్ కళాశాల ఎంత అభివృద్ధిలో కొనసాగుతుందన్నారు. ప్రభుత్వ సూచనల మేరకు సుమారు రూ.10 కోట్ల విలువైన భవనాలను, రూ.28 లక్షల నగదును ప్రభుత్వ జూనియర్ కళాశాలగా రూపాంతరం చెందిన ప్రభుత్వ ఖాతాలకు జమ చేశామన్నారు. కళాశాలకు చేసిన సేవలకు గాను, నివాళిగా కళాశాలకు శ్రీవర్ధినీడి సత్యనారాయణమూర్తి-వీరవాసరం ఎడ్యుకేషనల్ కమిటీ ప్రభుత్వ జూనియర్ కళాశాలగా నామకరణం చేశామన్నారు. సమావేశంలో వి.బలరాం సీహెచ్ ప్రభువరం తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు


ఉండి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులను తనిఖీ చేస్తున్న అధికారులు

భీమవరం: జిల్లావ్యాప్తంగా 127 పరీక్షాకేంద్రాల్లో మంగళవారం నిర్వహించిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షకు 95 శాతం విద్యార్థులు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ చెప్పారు. హిందీ పరీక్షకు మొత్తం 21,642 మంది హాజరు కావాల్సి ఉండగా 20,455 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. అలాగే ఎస్ఎస్‌సీ (ఏపీఓఎస్ఎస్) పబ్లిక్ పరీక్షకు 83 మందికిగాను 75 మంది హాజరుకాగా ఇంటర్మీడియట్(ఏపీఓఎస్ఎస్)పరీక్షకు 690 మందికి 629 మంది విద్యార్థుహాజరయ్యారన్నారు. 50 పరీక్షా కేంద్రాల్లో ఫ్లయింగ్‌స్క్వాడ్, 11 కేంద్రాల్లో జిల్లాస్థాయి పరిశీలకులు, 6 కేంద్రాల్లో డీఈఓ, 7 కేంద్రాల్లో ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ తనిఖీలు చేయగా ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులునమోదు కాలేదని వెంకటరమణ చెప్పారు.

ఉండిలో..

ఉండి: పదో తరగతి పరీక్షల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన హిందీ పరీక్ష ప్రశాంతంగా సాగింది. మండలంలోని ఉండి ఏ కేంద్రం నుండి 128 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 124 మంది హాజరయ్యారు .అలాగే ఉండి బి కేంద్రంలో 150 మందికి 149 మంది, యండగండిలో 150 మందికి 147 మంది, ఎన్నార్పీ అగ్రహారంలో 88 మందికి 85 మంది, ఉప్పులూరులో 56 మందికి 55 మంది హాజరయ్యారు.మొత్తానికి 572 మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా వీరిలో 12 మంది గైర్హాజరు కాగా 560 మంది మాత్రమే హాజరయ్యారు.అలాగే కంపార్టెమెంటల్‌గా హిందీ పరీక్షకు హాజరు కావాల్సిన 41 మందికి గాను 8 మంది హాజరై 33 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

సోమేశ్వరుడికి ఆభరణాల సమర్పణ


ఆలయ అర్చకులు, ఈఓకి ఆభరణాలను అందిస్తున్న దాతలు

కాళ్ల: స్థానిక శ్రీ గంగా పార్వతి సమేత సోమేశ్వరస్వామి వారికి దాతలు బంగారు, వెండి ఆభరణాలను సమర్పించడం అభినందనీయమని దేవస్థానం చైర్మన్ గనిశెట్టి షణ్ముకేశ్వరరావు అన్నారు. స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవాలు ముగింపు సందర్భంగా గ్రామానికి చెందిన దివంగత నిమ్మల భోగయ్య, మద్దిరావమ్మ దంపతుల కుమారుడు నిమ్మల రామ్మోహనరావు(రాము), ఝూన్సీ మహాలక్ష్మి దంపతులు, కుటుంబ సభ్యులు అమ్మ వార్లకు 2 బంగారం మంగళసూత్రాలు సెట్లు, స్వామివారికి వెండి యాజ్ఞోపవేతం , తలంబ్రాలు పోసుకునే 2 వెండి కొబ్బరి చిప్పలు బహుకరించారు. వీటి విలువ సుమారు రూ.1,20,000 ఉంటుందని దేవస్థానం ఈఓ కూచంపూడి శ్రీనివాసరాజు తెలిపారు. కల్యాణ మహోత్సవాలు సందర్భంగా వీటిని స్వామి,అమ్మవార్లకు అలంకరించామన్నారు. అనంతరం దాతలను పాలకమండలి సభ్యులు, గ్రామపెద్దలు అభినందించి సత్కరించారు.

దుంపగడపలో ఎన్ఎస్ఎస్ శిబిరం


దుంపగడపలో పరిసరాలను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

ఆకివీడు: అక్షర ఆయుధమే అన్నింటికీ సమాధానం చెబుతుందని ప్రిన్సిపాల్ కె.సుజాత చెప్పారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రెండో రోజు మంగళవారం ఎన్ఎస్ఎస్ క్యాంపు గ్రామ శివారు బోసు కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి అక్షరం నేర్చుకోవాలన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యాభ్యాసం కొనసాగించాలన్నారు. ప్రతి వ్యక్తి చదువుకునేందుకు ప్రభుత్వం అనేక సదుపాయాలు కల్పించిందని చెప్పారు. విద్య వల్ల కలిగే ప్రయోజనాల్ని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.ఆనంద కుమార్ వివరించారు. అక్షరాస్యత ఆవశ్యకతను, ఆధునిక సాంకేతిక విద్య అవసరాన్ని ఆంగ్ల అధ్యాపకులు కె.శామ్యూల్ వివరించారు. అనంతరం విద్యార్థులు కాలనీలోని పలు రోడ్ల పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకురాలు జి.పావని, యు.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి సేంద్రియ ఉత్పత్తులు మేలు


పెనుగొండ: సంపూర్ణమైన ఆరోగ్యానికి సేంద్రియ వ్యవసాయంతో వచ్చే ఉత్పత్తులు మేలు చేస్తాయని నేచురల్ ఫార్మింగ్ అసోసియేట్ కృపావతి అన్నారు. మంగళవారం చినమల్లంలోని రైతు మిద్దే శ్రీనివాస్ పొలంలో వేసిన మిర్చిపంటను పరిశీలించి, సేంద్రియ వ్యవసాయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. మిర్చి పంటలో ప్రధానంగా తామర పురుగు ఎక్కువగా గమనించామని, దీని నివారణకు ఉల్లి కషాయం పిచికారీ చేయాలన్నారు. మిర్చి పంటలో అంతర పంటగా నవధాన్యాలు సాగు చేయవచ్చన్నారు. దీని వల్ల అధిక రాబడి ఉంటుందన్నారు. సామూహికంగా జీవామృతం తయారు చేసే విధానంపై అవగాహన కల్పించారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు


దెయ్యాలతిప్పలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

భీమవరం అర్బన్: మండలంలోని దెయ్యాలతిప్ప, రామాయణపురం, ఎల్‌వీఎస్‌పురం గ్రామాలలో మంగళవారం సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలు కవాతు నిర్వహించారు. గ్రామాల్లోని వీధుల్లో లాంగ్ మార్చ్ నిర్వహించారు. రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్యకిషోర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఓటర్లు ఎవరి ప్రలోభాలకు గురవ్వకుండా ఓటు హక్కును తమకు ఇష్టమైన అభ్యర్థికి వేసుకోవచ్చన్నారు. అవాంఛనీయ, హింసాత్మక సంఘటనలకు తావు లేకుండా తాము ఉన్నామని భరోసా ఇచ్చారు. ఎవరైనా ఓటర్లను బెదిరిస్తే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో రూరల్ ఎస్సై జి. రాజు, హెడ్ కానిస్టేబుల్ పి. ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి


ఆచంటలో స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: ఎన్నికలు నిబంధనలు తప్పని సరిగా పాటించాలని అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆచంట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వి.స్వామినాయుడు హెచ్చరించారు. మంగళవారం ఆచంట తహసీల్దారు కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, విలేకర్లతో ఏర్పాటు చేసిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. పార్టీలు 19 రకాల అనుమతులు సువిధలో సింగిల్ విండో ద్వారా తీసుకోవచ్చునన్నారు. చిహ్నాల ముద్రించడం, సభల ఏర్పాటు, మైక్ ప్రచారం ఏర్పాట్లుపై ముందస్తు అనుమతులు తప్పనిసరి అన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌లో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయంలు, సచివాలయాల్లో బ్యానర్స్, పోస్టర్లు, ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రి, ఇతర శాఖల మంత్రుల ఫోటోలను 48 గంటలలోపు తొలగించామన్నారు. ప్రైవేటు స్థలాలు, ఇళ్లపై ఉన్న హోర్డింగ్ ఫ్లెక్సీలు 72 గంటల్లో తొలగించామని పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరూ ఏప్రిల్ 15 లోపున ఓటు నమోదుకు మరో అవకాశం ఇచ్చారని, దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా ఎవరైనా రూ.50 వేలకు మించి ఎక్కువ మొత్తంలో తీసుకువెళ్లరాదని, తీసుకు వెళితే తప్పని సరిగా రసీదు, సంబంధిత ధ్రువీకరణ పత్రాలు ఉండాలని లేకపోతే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

పెనుగొండ: మానసికొల్లాసాన్ని కాపాడడంలో క్రీడలు దోహదపడతాయని ఎస్వీకేపీ అండ్ డాక్టర్‌కేఎస్ రాజు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు అన్నారు. మంగళవాంర క్రాంప్టన్ శ్రీలక్ష్మి డిస్ట్రిబ్యూటర్ జిల్లా డీలర్స్ కొవ్వూరి సర్రెడి శ్రీ వంశీకృష్ణలు కబడ్డీ మెన్, బాస్కెట్ బాల్ మెన్, టేబుల్ టెన్నిస్ మెన్, విమెన్, బాక్సింగ్ మెన్, విమెన్ జట్లుకు చెందిన 50 మంది క్రీడాకారులకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు, ఫిజికల్ డైరెక్టరు డాక్టర్ బి.బాపిరెడ్డి చేతుల మీదుగా క్రీడా కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడూతూ కళాశాల నుంచి ఎంతో మంది ఉత్తమ క్రీడాకారులను తీర్చిదిద్దామన్నారు. కళాశాలలో క్రీడా సదుపాయాలను, క్రీడాకారుల స్ఫూర్తిని ప్రోత్సాహకులు సర్రెడ్డి వంశీకృష్ణలు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కలిదిండి రామచంద్ర రాజు, పాలకవర్గ అధ్యక్షుడు పితాని సూర్యనారాయణ, కోశాధికారి ఉద్దగిరి లవకుమార్ పాల్గొన్నారు.